రాయితీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం

తెలంగాణ రాష్ట్ర ఆహార శుద్ధి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ (పీఎంఎఫ్ఎంఈ) సీఐలో భాగంగా 35 శాతం రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాల మంజూరు కోసం దరఖాస్తులను అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ వెల్లడించారు.

– సాక్షి, సిటీబ్యూరో



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, స్వయం సహాయ సంఘాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సూక్ష్మ ఆహార పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ యువతసహా ఎవరైనా ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

- అభ్యర్థులు తమ దరఖాస్తును పూర్తి వివరాలతో ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, విద్యుత్ బిల్లు, యూనిట్‌కు సంబంధించిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. **జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమల డీఆర్‌పీఈ అమర్ సింగ్‌ను ఫోన్: 94934 38347లో సంప్రదించాలి.**

అర్హతలు ఇవే...

దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుదారులు గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం నుంచి రాయితీ పొంది ఉండకూడదన్నారు. ప్రాజెక్ట్ వ్యయంలో 35 శాతం వరకు రుణ అనుసంధాన రాయితీ (గరిష్ట రాయితీ పరిమితి రూ. 10 లక్షలు) ఉంటుందన్నారు. లబ్ధిదారుల వాటా కనీసం 10 శాతం ఉండాలని, మిగిలినది బ్యాక్ నుంచి రుణం ఇస్తారని వివరించారు.

జిల్లా స్థాయి 'యువజన' ఉత్సవాలు

సాక్షి, సిటీబ్యూరో: యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం యువజన సంబురాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా యువజన, క్రీడల అధికారి జి.వి.గోపాల్‌రావు తెలిపారు. చదువుతో పాటు కళలు, కళా ప్రదర్శనలు, ఆటల్లో యువతకు ఈ నెల 27న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం అవరణంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయసు వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు ఈ నెల 26వ తేదీలోగా కలెక్టరేట్ రెండో అంతస్తులోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో వ్యక్తిగతంగా కలవచ్చన్నారు. వాట్సాప్ నంబర్: 76609 19518లో కూడా వివరాలతో కూడిన పేర్లను నమోదు చేసుకోవచ్చని వివరించారు.

- ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకు జాతీయ స్థాయిలో జరిగే వేడుకలకు పంపిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వాస్తవ్యులై ఉండాలని, ఆధార్ కార్డ్, 2 పాస్ ఫొటోలు తప్పని సరిగా ఉండాలన్నారు.

పోటీలు ఇవే...

1) జానపద నృత్య బృందం (సభ్యుల సంఖ్య 10కి మించ రాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 15 నిమిషాలు).
2) జానపద పాటల బృందం (సభ్యుల సంఖ్య 10 మందికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు)
3) జానపద నృత్యం(వ్యక్తిగతం) (ఈ బృందంలో ఐదుగురికి మించరాదు. ప్రద ర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు).
4) జానపద పాటలు (వ్యక్తిగతం) (అయిదుగురు సభ్యులకు మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు). నోట్: సినిమా పాటలు అనుమతించరు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాలి.
5) కవిత్వం (హిందీ/ఇంగ్లిష్) (మొత్తం 500 పదాలతో గంటలో (60 నిమిషాలు) పూర్తి చేయాలి)
6) వ్యాస రచన(హిందీ/ఇంగ్లిష్) (ఇందులో 1,000 పదాలతో 60 నిమిషాల్లో పూర్తి చేయాలి)
7) పెయింటింగ్ పెయింటింగ్ (ఏ3 సైజులో 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి. చిత్రలేఖనానికి సంబంధించిన శీర్షిక 20–30 పదాలు మించకూడదు. పెయింటింగ్ సామగ్రిని ఎవరికి వారే తెచ్చుకోవాలి)
8) ఉపన్యాసం(హిందీ/ఇంగ్లిష్) (ఎంపిక చేసిన అంశంపై హిందీ లేదా ఇంగ్లిష్ 3 నిమిషాలు మించకుండా మాట్లాడాలి)
9) యువతి (హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి) (హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి కేటగిరీల్లో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు తీసుకురావాలి) ఇందులో ఎంపిక చేసిన వారు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారు.

28న సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి

జగద్గిరిగుట్ట: ఈ నెల 28న సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఉమా మహేశ్ తెలిపారు. జగద్గిరిగుట్టలోని కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. వేడుకలకు ఉద్యమకారులు, మేధావులు విద్యార్థులు, యువజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు హరినాథ్, శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి, రాములు కౌన్సిల్ సభ్యులు సామెల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి అధిక ప్రాధాన్యం



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలువురు సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం వినతి పత్రాలు అందజేశారు. అదే విధంగా పలువురు శుభకార్యాలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

బీఆర్ఎస్ హయాంలో విద్యారంగం నిర్వీర్యం



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు వినతి ప్రతం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కుత్బుల్లాపూర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగం నిర్వీర్యం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం కలిశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలని వినతిపత్రం అందించారు. వర్షం పడినప్పుడల్లా గదుల్లోకి నీళ్లు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ ప్రకాశ్, రిటైర్డ్ హెచ్‌ఎం అఫ్జల్, పాఠశాల కమిటీ చైర్మన్ శ్యామల, మోతె శ్రీనివాస్, సాయి కుమారి, వసుంధర తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నివారించవచ్చని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. కొంపల్లిలోని సెయింట్ ఆంథోనిస్ పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిబుల్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి తోటి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా వాహనాలు నడపాలని సూచించారు.

ప్రజావాణికి 17 వినతిపత్రాలు

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగగా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిప్రతాలు అందజేశారు. ఉప కమిషనర్లు నరిసింహ, మల్లారెడ్డి అర్జీల సత్వర పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ (2), ఇంజినీరింగ్ (5), ఎలక్ట్రికల్ (1) మొత్తం 8 ఫిర్యాదులు, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ (6), ట్యాక్స్ సెక్షన్(1), ఎంటమాలజీ (1), హెల్త్ అండ్ శానిటేషన్ (1) మొత్తం 9 ఫిర్యాదులు అందాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శంభీపూర్‌లోని తన కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సోమవారం ఆయన్ను కలిశారు. స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో వందలాది కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు.

పోషకాహారంపై అవగాహన

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసాన్ని పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలకు సోమవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. కార్యక్రమంలో నందానగర్ బస్తీ దవాఖాన వైద్యుడు డానియేల్, బస్తీ ప్రెసిడెంట్ కార్తీక్, అంగన్‌వాడీ టీచర్లు లలిత, జ్ఞానేశ్వరి, ప్రభావతి, రాద, నాగలక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కుత్బుల్లాపూర్: మాదాపూర్ ఎస్ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 12.7 కిలోల గంజాయి చాక్లెట్లు, 80 గ్రాముల గంజాయి పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు సోమవారం సుచిత్ర చౌరస్తాలో తనిఖీ చేపట్టాయి. బైక్‌పై వచ్చిన గాజులరామారం ప్రాంతానికి చెందిన ఇసార్ సింగ్ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా 12.7 కిలోల చాక్లెట్ గంజాయి, 80 గ్రాముల గంజాయి లభించింది. వీటి విలువ రూ.1,05,900 ఉంటుందని, ఒక్కో చాక్లెట్‌ను రూ.40 కు కన్‌స్ట్రక్షన్ వర్కర్లకు విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. మత్తు పదార్థాలను పంజాబ్ రాష్ట్రం ఆనంద్‌పూర్ సాహెబ్ నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 23ను బ్లాక్ డేగా పాటించాలని కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం నిజాంపేట్ వార్డు కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, వీటితో కార్మికులు కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారి కనీస వేతనం రూ.26 అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు హయ్యర్ పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈపీఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ. 9 వేలు తగ్గకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రవీణ్, యాదన్న, ప్రశాంత్, జితేందర్, శ్రీను, నరసింహ, బాలయ్య, దీపక్, పెంటమ్మ, లక్ష్మి, వెంకట్, కిషన్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

సుభాష్ నగర్: ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లోని సర్వే నంబర్ 342 ప్రభుత్వ స్థలంలో వెలసిన ఓ గదిని, జగద్గిరిగుట్ట పరిధి భూదేవి హీల్స్ సర్వేనెంబర్ 348 నిర్మించిన ప్రహరీ, బేస్‌మెంట్లను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సెలవు దినాలు కావడంతో కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారని సమాచారం రావడంతో తక్షణమే స్పందించి నిర్మాణాలను కూల్చివేశామని తెలిపారు.

ఉజ్వల భవిష్యత్‌కు విద్య తప్పనిసరి



నార్త్ సిటీ కిడ్స్ జోన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సుభాష్‌నగర్: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా తప్పనిసరిగా చదువుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సూరారంలోని నార్సిటీ హైస్కూల్లో నూతనంగా ఏర్పాటుచేసిన కిడ్స్ జోన్ భవనాన్ని ప్రిన్సిపాల్ కోలా వెంకటేశ్ ముదిరాజ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్‌కు విద్య తప్పనిసరి అని, చిన్నప్పటి నుంచే పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర నాయకులు



ఎన్నికల ప్రచారంలో గొల్ల జాన్ తదితరులు

చింతల్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ పాల్గొన్నారు. ఎన్ఎస్‌యూఐ తరఫున అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బరిలో నిలిచిన రోనాక్ ఖాత్రి నమ్రతతో కలిసి ఢిల్లీలోని పలు కళాశాలలు హాస్టల్స్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విద్యార్థులను కోరారు. ప్రచారంలో జాతీయ కార్యదర్శి అభిజిత్, జాతీయ సమన్వయకర్త మన్నె జీవన్, రాష్ట్ర కార్యదర్శి దత్తు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికిరణ్, సోహియల్, వెంకటేశ్, ఇర్ఫాన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ శంకర్ నాయక్

దుండిగల్: దశాబ్ద కాలంగా రోడ్డు సౌకర్యం లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో దుండిగల్ తండావాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ తండా సమీపంలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని ఫ్యాక్టరీల నుంచి వెలువడే ఘటైనా వాసన, పవర్ ప్లాంట్ నుంచి వస్తున్న బూడిదతో ప్రజారోగ్యాలు దెబ్బతింటున్నాయని, వీటికి శాశ్వత పరిష్కారాలు చూపాలన్నారు. 2022లో బంజారా కమ్యూనిటీ ఫంక్షన్ హల్ నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు ఇచ్చేందుకు కొన్ని కంపెనీలు ముందుకు వచ్చినా అధికారులు భూమిని కేటాయించడ లేదని, 1000 గజాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. అందించిన వారిలో తండావాసులు రవీందర్ నాయక్, విజయ్ నాయక్, నరేందర్ నాయక్, మదన్ నాయక్, తదితరులు ఉన్నారు.

నిరుపేదల కోసమే 'కల్యాణలక్ష్మి'



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌ఖాన్‌తో కలిసి 372 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయ్, ఖలీం తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన..

గాజులరామారం డివిజన్ షిరిడి హిల్స్‌లో రూ. 49.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వివేకానంద్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా యండమూరి ఎన్‌క్లేవ్, ద్వారక నగర్ ఫేజ్–1లలో రూ.35 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రూపాదేవి, ఏఈ కల్యాణ్, డీజీఎం రవి, జలమండలి మేనేజర్ రోహిణి, కల్యాణ్, ఫాక్స్ డైరెక్టర్ పరిసే శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గాజులరామారం డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన సోమిరెడ్డికి 'ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 1,10,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

గంజాయి విక్రేత, కొనుగోలుదారుల అరెస్టు

జీడిమెట్ల: గంజాయి విక్రేతతో పాటు సేవిస్తున్న ఏడుగురిని జీడిమెట్ల పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, ఎస్ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్‌లోని రాంరెడ్డినగర్‌లో మహమ్మద్ సైఫ్ అలీ (26) గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే జీడిమెట్ల ఎస్ఐ ఆంజనేయులు పెట్రోలింగ్ సిబ్బందితో కలిసి సైఫ్ అలీ ఇంటికి చేరుకుని తలుపులు తెరిచారు. ఇంట్లో రోడామేస్త్రీనగర్‌కు చెందిన ఏడుగురు యువకులు షేక్ హిదాయత్ (24), షేక్ ఇమ్రాన్ (32), మహమ్మద్ అజాం (34), అవుల దినేశ్‌రెడ్డి(23), రాహుల్ సింగ్ (23), మహమ్మద్ మజీద్ (28), మహమ్మద్ ఆరీఫ్ (28) గంజాయి సేవిస్తూ పోలీసుల కంటపడ్డారు. వెంటనే వారిని కిట్స్‌తో టెస్ట్ పరీక్షించగా పాజిటివ్ వచ్చింది. పోలీసులు సైఫ్ అలీ నుంచి ప్యాకెట్లలో ఉన్న 850 గ్రాముల గంజాయి, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. కాగా విచారణలో సైఫ్ అలీ ఒక్కో ప్యాకెట్ (8గ్రాములు) రూ.200 అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. ఎవరైనా గంజాయి అమ్మినా, తాగినట్లు అనుమానం ఉంటే సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ హరీశ్ కోరారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రధాన జంక్షన్లలో చకచకా అభివృద్ధి పనులు!



జగద్గిరిగుట్ట చాకలి ఐలమ్మ విగ్రహం చౌరస్తా వద్ద జరుగుతున్న పనులు

జగద్గిరిగుట్ట: జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రధాన జంక్షన్లలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయానికి సంబంధించిన గాజులరామారం సర్కిల్‌లో 2, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 2 జంక్షన్లను సుమారు రూ. 6 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు.

- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్‌లోని రంగా భుజంగా సినిమా హాల్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.
- కుత్బుల్లాపూర్ కార్యాలయం సమీపం అలాగే గాజులరామారం సర్కిల్ పరిధిలోని చిత్తారమ్మ టెంపుల్ సమీపంలో పనులు ప్రారంభం కానుండగా, ఉషోదయ టవర్స్ సమీపంలోని షాపూర్‌నగర్ జంక్షన్ల పనులు సాగుతున్నాయి.
- వీటితో పాటు రూ. 48 లక్షలతో ఇటీవలే చేపట్టిన జగద్గిరిగుట్ట చాకలి ఐలమ్మ విగ్రహం చౌరస్తా వద్ద జంక్షన్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యలు కూడా తప్పుతాయని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉషోదయ టవర్స్ సమీపంలోని షాపూర్‌నగర్ జంక్షన్ వద్ద ..

ప్రగతినగర్ చెరువు రోడ్డుపై ట్రా'ఫికర్'..!



ప్రగతినగర్ చెరువు రోడ్డుమార్గంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ చెరువు రోడ్డులో ఆదివారం వచ్చిందంటే చాలు ట్రా'ఫికర్' నెలకొంటున్నది. పెద్ద సంఖ్యలో మాంసం, చేపలు విక్రయించే దుకాణాలు వెలుస్తున్నాయి. దీంతో కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చి తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. నిబంధనల ప్రకారం ఖాళీ ప్రదేశాల్లో ఎవరికీ ఇబ్బందుల్లేకుండా వారాంతపు సంతలు, ఇతర వ్యాపారాలు నిర్వహించుకోవాలి. కానీ ప్రగతినగర్ చెరువు రోడ్డులో పలువురు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. కొందరు కిందిస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ దుకాణాలను అనుమతిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రగతినగర్ చెరువు రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో అటు కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు, ఇటు నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు తమ పరిధి కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దుకాణ సముదాయాలను ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.